క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిపాల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు అభివృద్ధికి సంబంధించి నివేదికలు తీసుకురావాలని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారం అందిస్తున్న అధికారులు

యాదమరి: గర్భవతులకు, బాలింతలకు, చంటి పిల్లలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండ తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మండల అంగన్‌వాడీ కార్యకర్తల అధ్యక్షురాలు మమత తెలిపారు. ఆమె శుక్రవారం కొనాపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో మండల పరిధిలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల గర్భవతులకు, బాలింతలకు, చంటి పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సమన్వయ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్: వినాయక చవితి పండుగ ఏర్పాట్లపై ఈ నెల 16న ఆర్డీవో కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీవో రేణుక తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే వినాయకచవితి పండుగ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఉత్తర్వులు పంపిన ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆర్డీవో ఆదేశించారు.

అంబేడ్కర్ విగ్రహ పనులు ప్రారంభం



విగ్రహ పనులను ప్రారంభించిన జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక

పూతలపట్టు: మండలంలోని రంగంపేట క్రాస్ జాతీయ రహదారి కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి, జీవరత్నం, జయపాల్, షణ్ముగం, బాలాజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

21న గురజాడ సాహిత్యంపై సదస్సు

చిత్తూరు కలెక్టరేట్: గురజాడ సాహిత్యంపై ఈ నెల 21న సదస్సు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షులు తులసినాథం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలమనేరులోని కళా మందిరంలో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో గురజాడ రచనలపై ప్రసంగించే విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కుస్తీలో విద్యార్థుల ప్రతిభ



సత్తా చాటిన విద్యార్థులు

యాదమరి: తిరుపతి జిల్లా వడమాలపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో మండల విద్యార్థులు విశేష ప్రతిభ కనభరిచారు. అండర్ 14 బాల బాలికల కుస్తీ పోటీల్లో యాదమరి పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు మొదటిస్థానం కైవసం చేసుకున్నారు. వీరు ఈ నెల 21 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారు. విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం గిరి రాజ, పీడీ రవి అభినందించారు.

నియోజకవర్గ బీసీ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్



నియామక పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గ బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ (మురళి) నియమితులయ్యారు. ఎర్రవారిపాళెం మండలం తలపులలో శుక్రవారం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహించారు. అందులో నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను నియమించారు. మండల అధ్యక్షుడు రమణ, గౌరవ అధ్యక్షుడు రాజేష్, ప్రధానకార్యదర్శి ఢిల్లీ ప్రతాప్, బీసీ మండల నాయకులు వెంకటేష్, రాంబాబు, పురుషోత్తం, గోపి పాల్గొన్నారు.

జిల్లాలోనే ప్రధాన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాణిపాకం వరసిద్ధుని బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. వినాయక చవితి నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వరసిద్ధి వినాయక స్వామి రోజుకో వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు. ఆ వాహన సేవలకు ఎంతో విశిష్టత ఉంది. ఒక్కో వాహన సేవలో స్వామిని దర్శించుకుంటే ఒక్కో రకమైన ప్రతిఫలం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. వాహన సేవల విశిష్టతపై ప్రత్యేక కథనం.

వరసిద్ధుని బ్రహ్మోత్సవం.. చూసి తరిద్దాం!



విద్యుద్దీపాల వెలుగులో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

- 18 నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు
- చవితిరోజు నుంచే గణనాథుని ఉత్సవాలు ఆరంభం

కాణిపాకం(యాదమరి): ప్రథమ పూజ్యుడు అయిన గణనాథుని బ్రహ్మోత్సవాలకు కాణిపాకం ముస్తాబవుతోంది. ఈ నెల 18న వినాయక చవితి నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగనున్నాయి. బ్రహ్మోత్సవాలలో స్వామివారు సిద్ధి, బుద్ధి సమేతంగా వివిధ వాహనాలలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, వాహన సేవల వివరాలు ఏంటో తెలుసుకుందాం.

ధ్వజారోహణం

వినాయక చవితి మరుసటి రోజు నుంచి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభం అవుతాయి. తొలిరోజు ధ్వజారోహణం, స్వామివారి వాహనమైన మూషికచిత్రపటాన్ని ఆలయ ధ్వజారోహణంపై ఎగురవేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరిగేలా దేవతలు ఆశీర్వదిస్తారని ప్రతీతి.

హంస వాహనం సేవ

మొదటి రోజు రాత్రి హంస వాహనంపై ఊరేగుతూ దేవదేవేరులు భక్తులకు దర్శనం ఇస్తారు. హంస వాహన సేవలో స్వామిని దర్శించుకుంటే మానవుల్లో సద్గుణాలు అలవడుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

మయూర వాహన సేవ

రెండవ రోజు స్వామివారు మయూర(నెమలి) వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇస్తారు. మనిషిలో మంచిని గుర్తించేందుకు నెమలి వాహన సేవను చూసి తరించాలంటూ పురాణాలు చెబుతున్నాయి.

మూషిక వాహన సేవ

మూషికాసురుడిని స్వామి వారు వధించి, అతని కోరిక మేరకు మూషికాన్ని తన వాహనంగా చేసుకొని మూడో రోజు ఊరేగుతారు. ఈ వాహన సేవలో పాల్గొంటే గర్వాన్ని పోగొట్టి మంచి మార్గంలో నడిపిస్తాడని నమ్మకం.

శేష వాహన సేవ

నాగలోకానికి అధిపతి నాగరాజు. అలాంటి శేష వాహనంపై వినాయకుడు నాలుగోరోజు భక్తులకు దర్శనం ఇస్తారు. ఉత్సవాలలో చిన్న, పెద్ద శేషవాహనాలపై ఉదయం, రాత్రి వేళలో పురవీధుల్లో ఊరేగుతారు.

వృషభ వాహన సేవ

వృషభానికి అధిపతి శివుడు. ఐదో రోజు ఉత్సవంలో వినాయకుడు వృషభ వాహనంపై కొలువుదీరి విహరిస్తారు. ఈ సేవలో పాల్గొంటే స్వామి వారి కరుణా కటాక్షాలతోపాటు శివుని అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

గజవాహన సేవ

ఆరో రోజు ఏనుగు తలను తన శిరస్సుగా మార్చుకొని స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి గజవాహనంపై స్వామి వారిని భక్తులు దర్శించుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రథోత్సవం

మూషికాసురుని సంహరణకు వినియోగించే రథంపై ఏడో రోజున స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అలాంటి రథోత్సవాన్ని తిలకిస్తే సకల దోషాలు పరిహరిస్తాయని భక్తుల విశ్వాసం.

అశ్వవాహన సేవ

మూషికాసురుని సంహారం తర్వాత బ్రహ్మమానస పుత్రికలైన సిద్ధి, బుద్ధిలతో స్వామివారికి కల్యాణోత్సవం చేస్తారు. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారు.

ఏకాంత సేవ


బ్రహ్మోత్సవాలు పూర్తయిన తర్వాత ధ్వజావరోహణాన్ని అంగరంగ వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. కార్యక్రమం తర్వాత స్వామివారి మూల విగ్రహానికి పాయసం, వడలతో అభిషేకం నిర్వహిస్తారు. దీనిని వడాయిత్తు ఉత్సవంగా అంటారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవను నిర్వహిస్తారు.



హంస వాహనం




మయూర వాహనం



మూషిక వాహనం



శేష వాహనం



వృషభ వాహనం



గజ వాహనం



రథోత్సవం



అశ్వ వాహనం

అంగన్‌వాడీలకు పౌష్టికాహారం పంపిణీ



గుడిపాల: పౌష్టికహార వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిపాల: గర్భవతులు, బాలింతలకు ఇంటివద్దకే టేక్‌హోమ్ రేషన్ పంపిణీ చేయనున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత తెలిపారు. పశుమందలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గర్భిణులు మరియు బాలింతల సౌకర్యార్థం ఇంటికే పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లీ, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీలకు వెళ్లి భోజనం చేయడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నందున ఇకపై ఇంటికే నేరుగా రేషన్ ఇస్తున్నామని చెప్పారు. ఒక్కొక్కరికి పదిరకాల వస్తువులతో న్యూట్రీషన్ ఫుడ్ అందజేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ పోషణ కిట్ అందిస్తున్నామన్నారు. గతంలో నెలకు 13 కోడిగుడ్లు ఇచ్చేవారిని ప్రస్తుతం వాటిని 25 కోడిగుడ్లకు పెంచినట్లు వివరించారు. గర్భం దాల్చినప్పటి నుంచి వారికి కావలసిన సేవలను ప్రభుత్వం వారి ఇంటివద్దకే వెళ్లి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ హరి, మహిళా పోలీస్ పావని, వైద్యసిబ్బంది జబ సెల్వి, విజయ, ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్లు కల్పన, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి





గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రష్మిత, ఐరాల: విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 90 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, కవిత, హైమావతి, స్వర్ణలత, రీటా పాల్గొన్నారు.

శుభ్రతతోనే వ్యాధులు మాయం



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే సగం వ్యాధులు దూరమవుతున్నాయని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం చవటపల్లి, టెలిఫోన్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమ నిర్వహణపై ఆరా తీశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆదేశించారు. తగిన జాగ్రత్తలతో దోమల వ్యాప్తి నుంచి బయటపడాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే



మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

గుడిపాల: నేటి ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శనీయమని పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వసంతాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు అట్లాస్‌లు అందజేత

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ సభ్యుడు తులసీరామన్ అట్లాస్ పుస్తకాలను అందజేశారు. తులసీరామన్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో అట్లాస్ ఆవశ్యకత ఉందని, ముఖ్యంగా అవి విద్యార్థుల ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు గోపి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు విజయబాబు, ప్రతినిధులు ప్రసాద్, జయరాం నాయుడు, కుప్పస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

ఐరాల/పూతలపట్టు/యాదమరి: వినాయక చవితి పండుగ సందర్భంగా వీధుల్లో, గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేయడానికి పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఐరాల, పూతలపట్టు, యాదమరి ఎస్‌ఐలు శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. వినాయక నిమజ్జనం రోజు, విగ్రహాలను తరలించే మార్గం, నిమజ్జన ప్రదేశం ముందుగా పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. కమిటీ సభ్యుల గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని, విగ్రహం పెట్టే సమయంలో ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులది అయితే వారి అనుమతి తీసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విగ్రహాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను జరుపుకోవచ్చని తెలిపారు. పైన తెలిపిన నిబంధనలు ఉల్లంఘించినట్లెతై చర్యలు తప్పవని తెలిపారు.

ఘనంగా మండల క్రీడాపోటీలు



పూతలపట్టు: క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పూతలపట్టు: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాల బాలికలకు మండల స్థాయి పాఠశాల క్రీడాపోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను శుక్రవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లోని విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలను మండల సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి ప్రారంభించారని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలను నిర్వహించి అందులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కమలాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయండి



కుప్పిగానిపల్లె లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డీఈ గురురాజన్

గుడిపాల: ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ గురురాజన్ అన్నారు. మండలంలోని గొల్లపల్లె, కుప్పిగానిపల్లె లేఔట్‌లలో నిర్మిస్తున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వీటన్నింటినీ లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలన్నారు. కుప్పిగానిపల్లెలో తాగునీటి సమస్య ఉందని తాగునీటి సమస్యను పరిష్కరిస్తే ఇంటి నిర్మాణాలు చేపడతామన్నారు. ఇంటి నిర్మాణాల పైన విద్యుత్ లైన్ వెళ్తున్నదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏఎల్ పురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రహరీగోడ నిర్మాణ పనులు పరిశీలించి నాణ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ గణేష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జాస్మిత పాల్గొన్నారు.

వినాయక చవితికి ఏర్పాట్లు ముమ్మరం

- చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న నగరవాసులు
- డీఐ రోడ్డులో సర్వాంగా సుందరంగా వినాయక మండపాల ముస్తాబు
- ఊరూరా కొలువుదీరనున్న గణపయ్య

చిత్తూరు రూరల్: నగరంలోని చవితి సందండి మొదలైంది. వాడవాడలా పందిరి ఏర్పాట్లు మొదలైంది. చురుగ్గా పనులు సాగుతున్నాయి. మండపాలు, విద్యుత్ కటౌట్‌లు భారీస్థాయిలో వెలుస్తున్నాయి. డీఐ రోడ్డులో భారీ ఎత్తున్న అంచనాలతో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇక మరిన్ని చోట్ల గణనాథుని కొలువుదీర్చిందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ఏర్పాటు పనుల్లో నిర్వాహకులు బిజీబిజీగా కనిపిస్తున్నారు.

డీఐరోడ్డులో...

చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో 47వ ఏటా వినూత్న రీతిలో వినాయకుని ప్రతిష్ఠిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీగా వినాయకుని ప్రతిష్ఠించేందుకు సిద్ధమయ్యారు. ఏర్పాటు పనులు సైతం శరవేగంగా పూర్తి చేస్తున్నారు. భారీ ఎత్తయిన విద్యుత్ దీపాలంకరణ కటౌట్లు కట్టారు. మండపం ముఖద్వారం వద్ద తీర్చిదిద్దిన సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సారి వివిధ రూపాల్లో ఉన్న ఐదు భారీ విగ్రహాలను కొలువుదీర్చనున్నారు. ఈనెల 18న చవితిని ప్రారంభించనున్నారు. ఎనిమిది రోజులపాటు సాయంత్రం విశేష పూజలు జరుగుతాయి. కేరళ వాయిద్యం, భజన కార్యక్రమాలు ఉంటాయి. 25వ తేదీ సాయంత్రం స్వామి వారిని నిమజ్జనం చేయనున్నారు. ఇందుకుగాను కేరళ, కర్ణాటక, తమిళనాడు వాయిద్యాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. కొంగారెడ్డిపల్లి, గిరింపేట, సంతపేట, ఎస్టేట్, కట్టమంచి, మురకంబట్టు, దొడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో కూడా చవితిని అట్టహాసంగా జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

ముందస్తు బుకింగ్‌లు

గంగజాతర తర్వాత భారీ స్థాయిలో జరిగే పండుగల్లో చవితి ఒకటి. వినాయక చవితిని వాడవాడలా జరుపుకుంటారు. ఈ పండుగ నిర్వహణలో పెద్దల కంటే, ఎక్కువగా యువతే ముందుంటుంది. అధిక వ్యయం చేస్తూ, పండుగను నిర్వహించేలా ప్రణాళికలు చేసుకుంటుంటారు. మరికొందరైతే చవితి పేరుతో చీటీలు వేసి ఆ నగదును రెండింతలు చేస్తుంటారు. ఖర్చులకు వెనకాడకుండా పండుగను నిర్వహిస్తుంటారు. ప్రధానంగా మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని చూస్తుంటారు. విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేస్తుంటారు. ముఖ్యంగా గణపతి విగ్రహం ప్రజలు మెచ్చేలా ఉండేలా పెడుతుంటారు. పూజలు, ప్రసాదాలు వ్యయం అధికంగానే చేస్తుంటారు. ఇకపోతే సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు వాయిద్యాలకు లక్షల్లో వ్యయం చేయడం పరిపాటిగా మారింది. ఈ సారి ఊరూరా వీధి వీధినా వినాయకుడు కొలువుదీరేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.





డీఐరోడ్డు మండపం వద్ద భారీ విద్యుత్ కటౌట్, డీఐ రోడ్డులో పందిరికి ప్రత్యేక అలంకరణ